## క్లుప్తంగా

### 17న మెగా వైద్య శిబిరం

పాన్‌గల్: డీసీపీ మధుకర్ స్వామి జన్మదినం సందర్భంగా ఈనెల 17వ తేదీన తిరుమలయ్య గుట్ట సమీపంలోని రేడియంట్ ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు గుడిసె శివలింగం, కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశం శెట్టి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉచిత హెల్త్ క్యాంపునకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. గుండె, ఎముకలు, నాడీ వ్యవస్థ, జీర్ణాశయ ప్రేగులు, కంటి, దంత, చిన్న పిల్లలు, మహిళా శిశు ఆరోగ్యం వంటి వాటికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### 18న మండల సర్వసభ్య సమావేశం

అమరచింత: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 18న ఎంపీపీ మాలతి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి పరుషియ తెలిపారు. సమావేశానికి సభ్యులు, మండల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

### తల్లిదండ్రులకు అవగాహన

ఆత్మకూర్: బడి మధ్యలో మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బడిబయటి పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

### మంత్రి పొన్నంను సన్మానించిన నాయకులు



వనపర్తి: రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను జిల్లా గౌడ సంఘం నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో శాలువాతో సన్మానించారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఆత్మీయ సన్మానం కార్యక్రమంకు హాజరైనట్లు తెలిపారు.

### కంటి వైద్య శిబిరం



పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో మెడ్విన్ హైదరాబాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 60 మందికి కంటి శస్త్రచికిత్సలకు సిఫార్సు చేయగా, 40 మందికి కంటి అద్దాలు, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఖాదర్, బిందు, వాణి, గిరీష్ పాల్గొన్నారు.

### అందరి సహకారంతోనే అభివృద్ధి

కొల్లాపూర్: అందరి సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొల్లాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జూపల్లి కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి లభించిందని దీనికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గం నిర్ణయానుసారం అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

### నేటి నుంచి పిల్లలమర్రిలో ఉర్సు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రి హజ్రత్ సయ్యద్‌షా కమాల్ హుస్సేనీ చిస్తీ, సయ్యద్ షా జమాల్ హుస్సేనీ చిస్తీ రహెమతుల్లా అలై దర్గా 648వ ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ముతవల్లి షా మహ్మద్ ఫజల్‌ఖాన్ తెలిపారు. ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 17న గంధోత్సవం ఊరేగింపు ఉంటుందన్నారు. 18న ఉత్సవాల ముగింపు ఉంటుందన్నారు.

# మొక్కజొన్న కొనేదెవరు?

- క్వింటాల్‌కు రూ.400 నుంచి రూ.వెయ్యి వరకు నష్టపోతున్న రైతులు
- అయోమయంలో మొక్కజొన్న, జొన్న రైతులు



చిన్నంబావిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న

చిన్నంబావి: ప్రభుత్వమే ప్రతి సీజన్‌లో మార్కెట్ ఫెడ్ ద్వారా మొక్కజొన్నలను మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుండేది. అదేవిధంగా జిల్లాలో మొక్కజొన్న పంట మాత్రమే సాగయ్యే భూములు ఉండడంతో రైతులు ఆ పంటనే సాగు చేస్తూ వచ్చారు. అయితే పంట చేతికి రావడం, ఉత్పత్తులను మార్కెట్‌కు రైతులు తరలిస్తున్నారు. కానీ ఈ సారి కొనుగోళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో రైతులు భయపడుతున్నారు. ఓ వైపు అకాల వర్షాలు కురుస్తుండడం, మక్కలు తడిసి ముద్దవుతున్నాయి. దీంతో ఏమీ చేయలేక రైతులు ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ.400 నుంచి రూ.వెయ్యి తక్కువకే కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**వేల ఎకరాల్లో సాగు**

మండలంలో వరి తర్వాత ఎక్కువగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న, శనగతో పాటు ఇతర పప్పు దినుసు పంటలను రైతులు వేల ఎకరాల్లోనే సాగు చేస్తుంటారు. ఈ సీజన్‌లో 7వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రభుత్వం మొక్కజొన్న పంటను సాగు చేయవద్దని సూచించినప్పటికీ మండలంలో కొన్ని ప్రాంతాల భూములు మొక్కజొన్నకే అనుకూలంగా ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులు వదులుకోలేకపోయారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు వానాకాలంలో మొక్కజొన్న పండించినట్లుగా నమోదు చేసుకున్న లెక్కల ప్రకారం దిగుబడులకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఎకరానికి 20–25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితి రైతుల్లో ఎదురవుతుంది. 15 రోజులుగా మొక్కజొన్న పంటను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.1,960 ఉండేది.

**కొనుగోళ్లకు ఎదురుచూపులు**

ప్రభుత్వం మొక్కజొన్నలను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఎప్పుడు ఏర్పాటు చేస్తుందోనని మండల రైతులు ఎదురు చూస్తున్నారు. 10 రోజులుగా అమ్మేందుకు నిరీక్షిస్తున్నారు. ప్రతి సీజన్‌లోనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ వస్తుంది. ప్రభుత్వం ముందుకు వచ్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

**కొనుగోలు చేస్తే బాగుంటుంది**



కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల మొక్కజొన్న రైతులం ఇబ్బందులు పడుతున్నాం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే లాభదాయకమే కాక సకాలంలో పంటను అమ్ముకునేందుకు వీలుంటుంది. బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గిపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తేమ శాతం పేరుతో క్వింటాల్‌కు రూ.400 తక్కువకు అమ్ముకోవాల్సి వస్తుంది. – జుర్రు గంగన్న, రైతు, చిన్నంబావి

**తేమ పేరుతో మోసం**



మొక్కజొన్నకు తేమశాతం సక్రమంగా లేదని బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు మొక్కజొన్నను అడుగుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు ఇలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులం నష్టపోతున్నాం. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాలు చేస్తే బాగుంటుంది. – శ్యాంరెడ్డి, రైతు, చిన్నంబావి

## చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



బొల్లారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కతలప్ప

వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. శుక్రవారం బొల్లారంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నమోదయిన గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహార నివేదికలను పరిశీలించారు. చిన్న వయస్సులో ఉన్న పిల్లలకు ఆట పాటలతో విద్యను నేర్పడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఆ తర్వాత గ్రామంలోని నర్సరీని సందర్శించిన ఆయన పంచాయతీ వర్కర్లకు మొక్కల పెంపకంలో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ ఉన్నారు.

## ‘ఉపాధి’లో పనులపై గ్రామసభలు



రాయినిపల్లిలో ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామ సభలో చర్చిస్తున్న గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని ప్రతి గ్రామంలో 2024–25లో ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీఓ రఘురాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పనుల గుర్తింపుపై గ్రామ సభలను ఈనెల 20వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేసి విత్తనాలు వేయడం పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో పనులకు వచ్చే కూలీల సంఖ్య 25 మందికి తగ్గకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి నిత్యం పనులు నిర్వహించాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టించాలన్నారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభ**

మండలంలోని రాయినిపల్లిలో 2024–25లో గ్రామంలో చేపట్టే ఉపాధి పనుల గుర్తింపుపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడారు. ఉపాధి పనుల గుర్తింపులో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనుల గుర్తింపు గ్రామ సభలో అందరి ఏకాభిప్రాయంతోనే తీర్మాణాలు చేయాలన్నారు. సమావేశంలో కార్యదర్శి రవి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కిష్టాపూర్‌తండా, రేమద్దుల ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచే విధంగా బోధన సాగించాలన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రతి నిత్యం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించాలన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏబీవీపీ నాయకులు

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రుచికరమైన పౌష్టికాహారం విద్యార్థులకు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరిస్తున్న పద్ధతులకు పొంతన లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో అఖిల్, రాజేష్, సందీప్, భరత్, ఉదయ్‌గౌడ్, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి

ఆత్మకూర్: సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక విండో కార్యాలయంలో డైరెక్టర్లతో సాధారణ సమావేశం నిర్వహిచారు. దళారులు అధిక ధర అంటూ ఎరవేస్తున్నారని తూకాలలో మోసం చేసి రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. వారిని నమ్మకుండా తాము ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. అలాగే సింగిల్‌విండో ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో సీఈఓ నరేష్, డైరెక్టర్లు శ్రీనివాస్, సహదేవుడు, తమ్మిరెడ్డి, మురళీ, మాసన్న, రాములు సిబ్బంది ఉన్నారు.

## ప్రతివారం మొక్కలకు నీరు పట్టాలి



ఉప్పరిపల్లిలో నర్సరీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్

ఖిల్లాఘనపురం: మండలంలో రోడ్ల వెంట నాటిన మొక్కలకు ప్రతి వారం తప్పనిసరిగా నీళ్లు పట్టాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఉప్పరిపల్లిలో నర్సరీ, రోడ్ల వెంట నాటిన మొక్కలకు నీళ్లు పట్టే పనులను పరిశీలించారు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో పనులు వేగంగా చేస్తున్నట్లు తెలిపారు. మట్టిని సిద్ధం చేసి బ్యాగ్‌ఫిల్లింగ్ పనులు పూర్తయ్యినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే విత్తనాలు నాటామని, పంచాయతీ కార్యదర్శులు తరుచుగా నర్సరీలను పరిశీలించి పనులు వేగంగా అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు చెప్పొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అంజద్

వనపర్తి: వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవటం వలనే నేరాలు అవుతున్నాయని అక్రమ మానవ రవాణా నిరోధక అధికారి, ఎస్‌ఐ అంజద్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్కాలర్స్ జూనియర్ కాలేజీ ఆవరణలో విద్యార్థులకు ఐటీ కోర్‌టీం, షీటీం పనితీరుపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, మహిళా రక్షణ, సైబర్ నేరాలను అదుపు చేయాలంటే ఇంటర్నెట్ ఉపయోగంపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. షీ టీం ఎలా పని చేస్తుంది? హ్యూమన్ ట్రాఫికింగ్, ఉమెన్ హెల్ప్ డెస్కులు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టం, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మికులు సరిహద్దు కార్మికుల రక్షణ అంశాలపై టీంలు పని చేసే విధానం, బాధితులు సంప్రదించాల్సిన విధానంపై వివరించారు.

## ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో జీవనోపాధికి విఘాతం ఏర్పడిందని పలువురు ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో శుక్రవారం ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.శ్రీనివాసులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడం వల్ల జీవనోపాధి కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల నుంచి ఆటోలు సరిగ్గా నడవకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారిందన్నారు. జిల్లాలో వేలాది ఆటో డ్రైవర్ల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని, ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని రద్దు చేసి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో రోడ్డుపైకి వచ్చి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆటోలతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్లు యాసిన్, రాజు, నాగేష్, వీరేష్, నర్సింలు, యాదయ్య, ప్రేమ్ పాల్గొన్నారు.

### కారు బోల్తా : తప్పిన ముప్పు

అడ్డాకుల: సంకలమద్ది శివారులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి ప్రమాదం తప్పిపోయింది. కొమిరెడ్డిపల్లికి చెందిన ఆటో పెట్రోల్ బంకులోంచి హైవే మీదకు వస్తోన్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల నుంచి హైదరాబాద్ వైపు ఓ కారు వెళ్తోంది. ఈ క్రమంలో ఆటో అడ్డురావడంతో కారులో ఉన్న మధుసూదన్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో అది అదుపు తప్పి ఆటోకు తగిలి రోడ్డుపై బోల్తాపడింది. మధుసూదన్‌తో పాటు మరొకరు స్వల్ప గాయాలతో నుంచి బయట పడ్డారు. ఆటోను డ్రైవర్ అకస్మాత్తుగా రోడ్డు మీదకు తేవడంతోనే ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. కాగా ఆటోలో ఉన్న సంచులు పడి పగిలిపోయి బియ్యం రోడ్డుపై పడ్డాయి. ప్రమాదానికి గురైన కారును టోల్‌ప్లాజా సిబ్బంది క్రేన్ సాయంతో మూసాపేట ఠాణాకు తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

### పోలింగ్ బూత్ మార్చాలని వినతి



నాగరాలలో స్థానిక నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల పంచాయతీలోని 1, 2వ సెంటర్లలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు జిల్లా అధికారులకు విన్నవించారు. ఈ మేరకు తహసీల్దార్ మురళీగౌడ్ శుక్రవారం 1, 2 సెంటర్లను సందర్శించి ఓటర్ల జాబితాను పరిశీలించారు. రెండు సెంటర్లలోని ఓటరు జాబితాను వేరు చేసి ఇవ్వాలని బీఎల్ఓలకు సూచించారు. ఒక సెంటరులో 500 మంది ఓటర్లు కలిగి ఉంటే అక్కడే పోలింగ్ బూత్ ఏర్పాటుకు అవకాశం ఉందని వారికి తెలిపారు.

### క్రీడా మైదానాలకు స్థలాలు కరువు



సింగంపేటలో మహిళా సమాఖ్య భవనం వద్ద క్రీడా మైదాన బోర్డు

అమరచింత: మండలంలోని సింగంపేట, చంద్రనాయక్ తండాలలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో సాధ్యం కాలేదు. రెవెన్యూ అధికారులు సింగంపేటలో ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేయగా, క్రీడా మైదానంకు అనువుగా లేకపోవడంతో బోర్డును మహిళా సమాఖ్య భవనం వద్ద ఉంచారు. చంద్రనాయక్‌తండాలో ఎక్కడ ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పట్టణ పరిధిలోకి వచ్చే వసతి గృహం మైదానంలో క్రీడా బోర్డును ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపు కున్నారు. ప్రభుత్వపరంగా క్రీడా మైదానం కోసం స్థలాన్ని కొనుగోలు చేసి చంద్రనాయక్‌తండాలోనే ఏర్పాటు చేయాలని తండా వాసులు కోరుతున్నారు.

### అదుపు తప్పితే అంతే..



మూలమళ్ల–అమరచింత రహదారిలో కాల్వపై ఉన్న వంతెన దుస్థితి

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వపై నిర్మించిన వంతెనల పిట్టగోడలు దెబ్బతింటున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని భయంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోని వంతెన దాటేస్తున్నారు. మండలంలోని అమరచింత నుంచి మూలమళ్లకు వెళ్తున్న కచ్చారహదారిపై ఎడమ కాల్వ దాటేందుకు ఇరు గ్రామాల ప్రజల రాకపోకల కోసం వంతెన నిర్మించారు. ప్రస్తుతం వంతెన పిట్టగోడలు దెబ్బతినడంతో అవి విరిగి పడుతున్నాయి. ప్రజలు వీటిని గమనించకుండా వెళితే కాల్వలో వారి వాహనాలు పడిపోవడం ఖాయమంటున్నారు. ఇప్పటికైన పీజేపీ అధికారులు స్పందించి వంతెన మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



వనపర్తిలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

వనపర్తిటౌన్: కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సౌమ్య తెలిపారు. శుక్రవారం విద్యార్థులు ఆశా, షేక్‌సానియా, లక్కీ శ్రీ, లీనా ప్రసన్నను ఆర్ఎల్‌సీ హవేలారాణి, ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు. వీరు రాష్ట్రస్థాయి హాకీ పోటీలో పాల్గొననున్నారని ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ సుజాత పాల్గొన్నారు.

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు శాలిని, అమృత రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీలు భారతి, రాజేశ్వరీ తెలిపారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో రాష్ట్రస్థాయికి వీరు ఎంపికైనట్లు తెలిపారు.



శాలిని, అమృత

### ఆధార్ సెంటర్ లేక ఇబ్బందులు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. ఆధార్ కార్డుల అప్‌డేట్, అడ్రస్‌ల మార్పు కోసం ప్రజలు ఇతర పట్టణాలకు వెళ్లవలసిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు. జిల్లా కేంద్రానికి లేదా మరికల్, ధన్వాడకు వెళ్తున్నారు. ఇటీవల మరికల్‌లో ఆధార్ సెంటర్ మూత పడడంతో పరిస్థితి మరి దారుణంగా మారింది. ఇక జిల్లా కేంద్రంలో అయితే ముందుగా వెళ్లి ఆధార్ కేంద్రంలో టోకెన్ తీసుకోవాల్సి వస్తోంది. దేవరకద్రలో ఏడాది కాలంగా ఆధార్ కేంద్రాన్ని మూసి వేశారు. జిల్లా అధికారులు, మండల అధికారులకు కనీసం ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆలోచన రాకపోవడంపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సరైన కార్యాలయాలు లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికారులు వెంటనే స్పందించి దేవరకద్రలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

**అధిక వసూళ్లు..**

దేవరకద్రలోని మీ సేవా కేంద్రాలు నిర్ణయించిన రుసుముకన్నా ఎక్కువగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన దాని ప్రకారం కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం రూ. 45 తీసుకోవాలి, కానీ కొన్నిచోట్ల రూ. 60 వరకు వసూలు చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే రసీదులు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.